మరమ్మతులకు వాస్తవ నివేదికలు సిద్ధం చేయండి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 12 : జిల్లాలోని పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు వాస్తవ నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ వసతి గృహాలు జిల్లాలో 55 ఉన్నాయన్నారు. వీటిలో మరమ్మతులు చేపట్టేందుకు సోమవారం వరకు అంచనా నివేదికలు అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల మరమ్మతులు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, తలుపులు, కిటికీల ఏర్పాటు, రక్షిత మంచి నీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్, విద్యుత్ హీటర్లు ఏర్పాటు, కోతుల బెడద నివారణకు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు లాంటి అవసరాలకు అంచనాలు ఇవ్వాలని సూచించారు. ఉప ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్ర ప్రధాన దవాఖానలో సి టీ స్కాన్ యంత్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని, మూడు నెలల్లో సి టీ స్కాన్ సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన ఆరోగ్య కేంద్రాలకు రంగులు వేసి అందుబాటులోకి తీసుకురావాలని, సబ్ సెంటర్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కొన్నిచోట్ల నిర్మాణం మొదలు పెట్టని హెల్త్ సెంటర్ల నిర్మాణం చేపట్టాలని టీజీఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. సమావేశం లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్, పీఆర్‌ఈఈ దిలీప్, టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ నరేందర్‌రెడ్డి, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు సభ్యుల ఫిర్యాదు

గణపురం, సెప్టెంబర్ 12 : గణపసముద్రం చెరువును ఓ కాంట్రాక్టర్‌కు రెండేళ్లపాటు అప్పగించేందుకు చీటి ఒప్పందం చేసుకున్న గణపురం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని సభ్యులు బుధవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాశ్‌ను కలెక్టర్ ఆదేశించగా గురువారం ఆయన పాలక వర్గానికి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని, లేకపోతే టీజీసీఎస్ యాక్ట్ 1964 ప్రకారం అధ్యక్షుడు, కార్యవర్గంపై తదుపరి విచారణకు ఆదేశించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ మైలారం, గాంధీనగర్, బుర్రకాయలగూడెం, బాగిరిపేట, దుంపిల్లపల్లి, గ్రామాల పరిధిలోని మత్స్య కార్మికులు గణప సముద్రం సరస్సును నమ్ముకుని జీవిస్తున్నట్లు చెప్పారు. నూతన పాలక వర్గం ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా రెండేళ్ల పాటు సరస్సులో చేపలు, రొయ్య పిల్లలను పోసుకొని అమ్ముకునేలా కాంట్రాక్టర్‌తో స్టాంప్ పేపర్‌పై సంతకాలు చేసి ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఈ కాలంలో సంఘం సభ్యులు ఎవరూ చేపలు పట్టవద్దని, ఒకవేళ పడితే రూ.50 వేల జరిమానా విధించనున్నట్లు ఒప్పందం చేసుకున్నారన్నారు. చెరువును లీజుకు ఇచ్చే అధికారం పాలకవర్గానికి లేదని, ఈ విషయమై మత్స్యశాఖ జిల్లా అధికారులను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ స్పందించి న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

నేడు లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు వేలం

వెంకటాపూర్, సెప్టెంబర్ 12 : రామప్ప దేవస్థాన ఆవరణలో లడ్డూ, పులిహోర అమ్ముకొనుటకు, కొబ్బరిముక్కలు పోగుచేసుకునేందుకు వేలం పాటను ఆలయ ఆవరణలో శుక్రవారం 12.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు.

గురువారం ఈవో మాట్లాడుతూ లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు బ్రాహ్మణులు మాత్రమే రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. కొబ్బరిముక్కలు పోగుచేసుకునేందుకు రూ.20వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. వివరాలకు 9640131263, 91827585 90, 9347241 990 నంబర్లకు ఫోన్ చేసి కానీ, కార్యాలయంలో కానీ సంప్రదించాలని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★LAB TECHNICIANS-BOYS,
★PHARMACY BOYS (మందుల షాపు)
★OT BOYS కావలెను. సంప్ర : Guardian Hospital, Mulugu 'X' Road, Warangal. 12 to 2 PM.
NTW-0427

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

బస్ పాస్‌ల అందజేత

మహదేవపూర్, సెప్టెంబర్ 12 : మండలంలోని రాపల్లికోటలో సుమారు 12 మంది దివ్యాంగులకు టీజీఎస్ ఆర్టీసీ రాయితీ బస్‌పాస్‌లను గురువారం వీబీవో (విలేజ్ బస్ ఆఫీసర్) వేల్పుల చంద్రమౌళి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు సదరం, ఆధార్, ఫొటో, రూ.50 సమీపంలో ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్‌లో అందజేసి రాయితీ పాస్ పొందవచ్చున్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్‌ల్లో 50 శాతం రాయితీ ఉంటుందని వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 12 : చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో జ్వరంతో బాధపడుతున్న చిన్నారికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. నూగూరుకు చెందిన ఇండ్ల సుశాంత్ గత పది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితిని తెలుసుకొని సుశాంత్ తల్లిదండ్రులు ఇండ్ల రాజ్‌కుమార్, సత్యవతి దంపతులకు రూ.30వేలను వైద్య చికిత్స నిమిత్తం సాయంగా గురువారం అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ తెలిపారు.

ఆటోలకు సీరియల్ నంబరు తప్పని సరి

రేగొండ, సెప్టెంబర్ 12 : గ్రామాల్లోని ఆటోలకు తప్పని సరి సీరియల్ నంబర్ వేసుకోవాలని, లేకపోతే సీజ్ చేయనున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించి ఆటోలకు సీరియల్ నంబర్లు కేటాయించారు. సిబ్బంది లింగమూర్తి, ఆటో సంఘం నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ములుగు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క
- జిల్లాలో సుడిగాలి పర్యటన
- ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభం
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలని ఆదేశం
- పిడుగుపాటుకు గురై మృతి చెందిన బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

ములుగులో బండారుపల్లి ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్/గోవిందరావుపేట/తాడ్వాయి, సెప్టెంబర్ 12 : ములుగు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తూ శాయశక్తులా కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీశిశు సంక్షేమశాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఆమె ములుగు మండలంతోపాటు గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ములుగు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతోపాటు ప్రారంభోత్సవాలలో మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి పాల్గొన్నారు. మల్లంపల్లి గ్రామంలో ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా మహాలక్ష్మీ మిల్క్ పార్లర్, కోమలి డిజిటల్ స్టూడియో, బుక్‌స్టాల్, జిరాక్స్ ఇంటర్నెట్ సెంటర్, సునిత ఎంబ్రాయిడరీ వర్క్స్, సారీ సెంటర్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి శివతండాకు చేరుకొని జడ్పీ రోడ్డు నుంచి రాంసింగ్ తండా వరకు రూ.1కోటి 10లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం జాకారం గ్రామానికి చేరుకొని రూ.28.25లక్షల నిధులతో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకొని రూ.6కోట్ల అంచనాతో ములుగు నుంచి బండారుపల్లి మీదుగా బుద్ధారం రహదారిలో నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పులిగుండం గ్రామంలో చింతకుంట వరకు రూ.70లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఆ తర్వాత జంగాలపల్లి క్రాస్ వద్ద జంగాలపల్లి నుంచి అంకన్నగూడెం వరకు రూ.30కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. గోవిందరావుపేట మండలంలోని జాతీయ రహదారి నుంచి పూట్ ఫారమ్ గ్రామానికి రూ.1కోటి 86లక్షల వ్యయంతో, పస్రా పాతనాగారం నుంచి నేతాజీనగర్ గ్రామానికి రూ.60లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట మండలంలోని మడవి ఎదుమయ్య, తాడ్వాయి మండలంలోని నార్లాపురం గ్రామానికి చెందిన పుట్ట మహేశ్‌లు ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందగా వారి కుటుంబాలకు మంత్రి సీతక్క రూ.5లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. అలాగే కాల్వపల్లి గ్రామానికి చెందిన జెర్రిజోతుల మల్లికార్జున్ వాగులో చిక్కుకొని మృతి చెందగా అతని భార్య భారతికి రూ.5లక్షల చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధికి ములుగు నుంచి బండారుపల్లి, నర్సాపూర్ మీదుగా రోడ్డు విస్తరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. బస్టాండ్‌ను విస్తరించేందుకు కావాల్సిన ఏర్పాట్లలో భాగంగా జిల్లా కేంద్రంలో ఉన్న పాలశీతలీకరణ కేంద్రాన్ని తరలించేందుకు జాకారం శివారులో నూతన భవనాన్ని నిర్మింపజేశామని అన్నారు. అధికారులతో సర్వే నిర్వహించి ములుగులో బస్టాండ్ విస్తరణ పనులను త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలని ఆదేశం

జాకారం గ్రామంలో పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి సీతక్కను ములుగు జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలని కోరగా మంత్రి సీతక్క స్పందించారు. అనువైన స్థలాన్ని గుర్తించి జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా బండారుపల్లి రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోతున్న పలువురు దుకాణాదారులు ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపాలని కోరగా సీతక్క సానుకూలంగా స్పందించి రోడ్డు విస్తరణ పూర్తయిన తర్వాత అనువైన స్థలాన్ని చూపిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్‌రావు, ఈఈ వెంకటేశ్, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్, ములుగు మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, గోవిందరావుపేటలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పాలడుగు వెంకటకృష్ణ, చింత క్రాంతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రేగొండ, సెప్టెంబర్ 12 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మండలంలోని రూపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మొగిలి ఇటీవల డెంగ్యూతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, పారిశుద్ధ్య పనులు, డ్రై డే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట మండల వైద్యా ధికారి హిమాబిందు, చందన, ఏఎన్‌ఎంలు కళాప్రియ, సుగుణ ఉన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, సెప్టెంబర్ 12 : భారతదేశ కీర్తి ప్రతిష్టలను, ప్రజలను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను గురువారం బీజేపీ నాయకులు అంబేద్కర్ సెంటర్‌లో దహనం చేశారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికా పర్యటనలో దేశంపై అక్కసుతో రాహుల్ విషం చిమ్ముతున్నారన్నారు. రిజర్వేషన్ల రద్దుకు తెరలేపుతున్నారని, భారత వ్యతిరేక శక్తులతో సమావేశమవడం దుర్మార్గమన్నారు. రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం చాలా బాధాకరమని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'మున్సిపల్ జవాన్‌పై చర్యలు తీసుకోవాలి'

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 12 : మున్సిపల్ జవాన్ ప్రశాంత్ అక్రమాలకు పాల్పడుతున్నందున అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మకు భూపాలపల్లి డీపీ చికెన్‌సెంటర్ యజమాని పాలడుగుల శ్రీనివాస్ గురువారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి చికెన్ సెంటర్ సంఘం నుంచి వేస్టేజ్ కోసం మున్సిపాలిటీకి ప్రతి నెలా రూ.25వేలు ఇస్తున్నామన్నారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి ఆరు నెలలకు రూ.1.50 లక్షలకు జవాన్ ప్రశాంత్‌కు ఇవ్వగా డమ్మీ బిల్లు ఇచ్చాడని ఆరోపించారు. పది రోజుల క్రితం ఈ విషయమై ప్రశాంత్‌ను అడగగా నేను, మా సిబ్బంది పంచుకున్నామని చెప్పున్నాడన్నారు. ఆయనకు తమ సంఘంలోని సభ్యులు భార్గవ్, వేణు, మహేశ్, సంజీవ్ అండగా ఉంటూ బెదిరిస్తున్నారని, సంఘంలో నిల్వ ఉన్న రూ.3.74లక్షలు తనకు ఇవ్వకుండా పంచుకున్నారన్నారు. షాపునకు కోళ్లు ఇవ్వకుండా చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పన్నులను సొంతానికి వాడుకుంటున్న జవాన్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'ప్రజాపాలన' భూపాలపల్లి ఇన్‌చార్జిగా వీరయ్య

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 12 : జిల్లాలో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవం వేడుకలకు ఇన్‌చార్జిగాఅటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 10 గంటలకు జరిగే వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేములపల్లి విద్యార్థులు

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 12 : సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు వేములపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈనెల 8న హనుమకొండ జేఎన్‌ఎస్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన పాండవుల విశాల్, నాగరాజ్, కంకటి వైశాలి, గుత్తికొండ కీర్తన 13 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన చెప్పారు.

ముమ్మరంగా ధ్వంసమైన చెట్ల సర్వే

తాడ్వాయి, సెటంబర్ 12 : గతనెల 31న సుడిగాలి సృష్టించిన బీభత్సంలో మేడారం అడవుల్లో నేలవాలిన చెట్ల సర్వేను అటవీ అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. త్వరగా సర్వేను పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ములుగు జిల్లాలోని సుమారు 220మంది అటవీ సిబ్బంది, రేంజ్ అధికారులు సర్వే నిర్వహిస్తుండగా డీఎఫ్‌వో, ఎఫ్‌డీవోలు సర్వేను పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. ఏటూరునాగారం మండలంలోని దొడ్ల గ్రామ సమీప అడవి నుంచి తాడ్వాయి మండలంలోని కొంపర్తి గ్రామం వరకు సుడిగాలి బీభత్సం సృష్టించింది.

సాధ్యమైనంత త్వరగా సర్వేను పూర్తి చేసి నష్టంపై ఓ అంచనా వేసేందుకు అటవీ అధికారులు కష్టపడుతున్నారు. సుమారు 500ఎకరాల్లో చెట్లు నేలకూలడంతో ముందుకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో చెట్లపై నుంచి దాటుకుంటూ సర్వే చేయడంలో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. అయినప్పటికీ సర్వేను పూర్తి చేసేందుకు ముమ్మరంగా చెట్ల కొలతలను, ఎన్ని చెట్లు కూలాయి అని లెక్కిస్తున్నారు. సర్వేను పూర్తి చేసి తిరిగి ప్లాంటేషన్ చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

లడ్డు వేలానికి స్వస్తి... లక్కీడిప్ ద్వారానే ఎంపిక

సాయిబాబా ఆలయంలో వినూత్న పద్ధతి

ఏటూరునాగారం, సెప్టెంబర్ 12 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడి వద్ద రెండు లడ్డూలను పెట్టారు. ఇక వీటికి వేలం నిర్వహించకుండా లక్కీడిప్ ద్వారా అందించేందుకు నిర్ణయించారు. ఎవరైనా భక్తుడు లడ్డు కావాలంటే రూ.116 అందజేస్తే వారి పేరును నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజున తీసే డ్రాలో వేయనున్నారు. ఇలా రూ.116లు అందజేసిన వారి పేర్లతో డ్రా తీసి రెండు లడ్డూలు, ఒక కలశం చెంబును కూడా ఇవ్వనున్నారు. మూడింటి కోసం లక్కీడిప్ తీయనున్నారు. లక్కీడిప్‌లో ఎవరికైతే వస్తుందో వారికి లడ్డు అందజేయనున్నారు.

కాగా, భక్తులు రూ.116లు అందజేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ చేసిన ప్రకటనతో ఒక్క రోజులోనే వంద మందికి పైగా రూ.116లు చెల్లించారు. ఇక నుంచి ఇదే పద్ధతిని సాయిబాబా ఆలయంలో అమలు చేస్తామని ప్రభాకర్ తెలిపారు.

'కచ్చితమైన సమాచారం అప్‌డేట్ చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న అర్షం రాజు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 12 : యూ డైస్ ప్లస్ పోర్టల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాల భౌతిక వసతులను పరిశీలించి కచ్చితమైన సమాచారాన్ని క్షుణ్ణంగా అప్‌డేట్ చేయాలని సమగ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ అర్షం రాజు సూచించారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో యూ డైస్ ప్లస్ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ యూ డైస్‌లో ఉన్న సమాచారాన్ని అనుసరించి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. యూనిఫాం, ఉచిత పాఠ్య పుస్తకాలు వస్తాయన్నారు. నిర్ణీత గడువులోగా సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల విద్యాధికారి ఎల్ రాజేశ్‌కుమార్, ఏటూరునాగారం నోడల్ ఆఫీసర్ కొయ్యడ మల్లయ్య, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సాంబశివ రావు, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డిటర్ శ్రీనువాస రెడ్డి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

20న ఐటీడీఏలో పాత వాహనాల వేలం

ఏటూరునాగారం, సెప్టెంబర్ 12 : ఐటీడీఏలో పాత వాహనాలు, పనికిరాని స్క్రాప్‌నకు ఈనెల 20వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు ఈనెల 18వ తేదీలోగా రూ.25వేలు ధరావత్ సొమ్ము డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన దరఖాస్తు ఫారం ఐటీడీఏ కార్యాలయంలో రూ.1000 చెల్లించి తీసుకోవాలన్నారు. వేలం నిర్వహించే సామానులు కార్యాలయం పని దినాల్లో చూసుకునే అవకాశం ఉందన్నారు. ఇంకా ఏమైనా వివరాలు కావాలంటే 9676363101 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. తగిన రుసుము రానిచో వేలంను రద్దు చేసుకునే అధికారం తమకే ఉంటుందన్నారు. వేలం నిర్వహించే వాహనాల వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ36ఎం1 బొలెరో వాహనం, ఏపీ 36ε4610 కమాండర్ జీపు, జీసీసీకి సంబంధించి ఏపీ31టీయూ2983 అశోక్ లేలాండ్ లారీ, ఏపీ31ఎం625 మహీంద్రా జీపు, ఎంప్లాయిమెంటు కార్యాలయంలో ఉన్న ఇనుప బీరువాలు 20, ఒక జనరేటర్, ఐదు అల్యూమినియం డోర్లు, ఆరు ఇనుప గేట్లు, మూడు మానిటర్లు, రెండు సీపీయూలు, రెండు ప్రింటర్లు, ఎనిమిది పాత కుర్చీలకు వేలం నిర్వహించనున్నట్లు పీవో ప్రకటించారు.

'కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి సరికాదు'

ములుగురూరల్, సెప్టెంబర్ 12 : ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటనలో జరిగిన దాడిని ఖండించారు. ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చుతున్న కాంగ్రెస్ పార్టీ విధానాలు సరికావన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాడుతున్నందునే కౌశిక్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు టార్గెట్ చేశారన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

మహదేవపూర్, సెప్టెంబర్ 12: మిలాద్ ఉన్ నబీ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మండల ముస్లిం కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సీఐ రామచంద్రరావు, ఎస్సై పవన్ కుమార్, పోలీసులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు

కాటారం, సెప్టెంబర్ 12 : మండలంలోని పలు ఎరువుల దుకాణాలు, డీసీఎంఎస్ సెంటర్లను వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శ్రీపాల్ గురువారం తనిఖీ చేశారు. ఏవో పూర్ణిమతో కలిసి దామెరకుంట కేడీసీఎంఎస్, గంగారం డీసీఎంఎస్‌లను తనిఖీ చేసి ఎరువుల స్టాక్, అమ్మకాల రికార్డులను, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. డీసీఎంఎస్, కేడీసీఎంఎస్, పీఏసీఎస్ సెంటర్లలో అవకతవకలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లదేనన్నారు. ఏఈవో రాజన్న పాల్గొన్నారు.

నేడు జీపీల్లో ముసాయిదా ఓటరు జాబితా

మహదేవపూర్, సెప్టెంబర్ 12 : రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నేడు (శుక్రవారం) జీపీల్లో పంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో ఆయా రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఆయా జీపీల్లో తెలియజేయాలని ఆయన సూచించారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 12 : మండలంలో ఘనంగా గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదు రోజులపాటు పూజలు చేసిన అనంతరం 6వ రోజు శివాలయం సెంటర్, పాత మార్కెట్ సెంటర్, బీసీ మర్రిగూడెంలోని విగ్రహాలను మండలకేంద్రంలో ఊరేగింపుగా తీసుకెళ్లి పాలెంవాగులో నిమజ్జనం చేశారు.

వరద బాధితులను ఆదుకోవాలని ధర్నా

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 12 : వరదలతో నష్టపోయిన వారిని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం బాధితులకు తక్షణ సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్, జిల్లా సమితి నాయకులు క్యాతరాజు సతీశ్, మాతంగి రామచందర్, నూకల చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో డిగ్రీ కళాశాల విద్యార్థినికి సీటు

మహదేవపూర్, సెప్టెంబర్ 12 : స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థిని చినుముల శిరీష హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించింది. దీంతో ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినిని అధ్యాపక బృందం, సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, రజిత, పోరిక రాజు, రమేశ్, మున్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 12 : గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికుల జీతాలను సైతం సమయానికి చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. మంత్రి సీతక్క చొరవ తీసుకొని మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులతోపాటు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తూ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా కృషి చేయాలని అన్నారు.

సాయుధ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

మహాముత్తారం, సెప్టెంబర్ 12 : వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. గురువారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల యాదిలో సభకు మండల కార్యదర్శి పొలం చిన్న రాజేందర్ అధ్యక్షత వహించగా సాయిలు హాజరై మాట్లాడారు. నాడు దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని నేడు బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. దీనిని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

అతివేగంగా బైక్ నడిపిన వ్యక్తిపై కేసు

వాజేడు, సెప్టెంబర్ 12 : మండలంలోని పాయబట్ల గ్రామంలో ఉన్న 163 జాతీయ రహదారిపై గురువారం వాజేడు ఎస్సై రుద్రరాపు హరీశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీలు చేస్తున్న సమయంలో చెరుకూరు గ్రామానికి చెందిన మడప ప్రవీణ్ పల్సర్ బైక్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

గోవిందరావుపేట, సెప్టెంబర్ 12 : చేపల కోసం అడవిలోని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగులోకి వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మొట్లగూడెం గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాడె బలరాం(54) గ్రామ శివారులో ఉన్న వాగులోకి గురువారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ఫిట్స్ వచ్చి వాగులో పడి మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

పాము కాటుకు గురైన వ్యక్తికి చికిత్స

పలిమెల, సెప్టెంబర్ 12 : మండలకేంద్రానికి చెందిన దుర్గం నరేశ్ వ్యవసాయ పనులు చేస్తుండగా గురువారం పాము కాటు వేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యుడు విజయ్‌కుమార్ యాంటి స్నేక్ వేనం (ఎఎస్‌వీ) ఇచ్చినట్లు తెలిపారు. అతడి పరిస్థితి నిలకడగానే ఉన్నా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 108 వాహనంలో భూపాలపల్లి దవాఖానకు తరలించారు. నర్సింగ్ ఆఫీసర్, మరియా, హెల్త్ సూపర్‌వైజర్ మాషుక్‌అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి

గణపురం, సెప్టెంబర్ 12: మండల కేంద్రానికి భూపాలపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్ రాధిక దంపతుల కూతురు అశ్విని (17) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆమె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. విద్యార్థిని మృతితో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా''
తేది: 23 సెప్టెంబర్ 2024 (తేదీ) న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర. సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	భూపాలపల్లి C0890 టిజి	xxxxxxxxxxx6212	ఎర్రగడ్డ వెంకటేశ్వర్లు	80186	22-జూలై-24	19.7	18.7
2	భూపాలపల్లి C0890 టిజి	xxxxxxxxxxx9764	కొత్తపల్లి శారధ	62314	30-జూలై-24	20	15.8
3	భూపాలపల్లి C0890 టిజి	xxxxxxxxxxx8144	పెరబోయిన నర్సింహులు	93013	26-ఆగస్టు-24	24.7	22.7

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను. అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

నిమజ్జనానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం : కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన వద్ద సోమవారం జరిగే వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. గురువారం కాళేశ్వరం ఆలయ ఆవరణలోని రాజ రాజేశ్వర హాల్ కార్యాలయంలో ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. సోమ, మంగళవారాల్లో జరిగే నిమజ్జనానికి వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి విగ్రహాలు రానున్నాయని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కాళేశ్వరం వంతెన వద్ద ప్రత్యేక అధికారులను నియమించామని, పోలీసు బలగాలను కేటాయించామన్నారు. అలాగే రెండు రోజులు ఇసుక క్వారీలను బంద్ చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా 40 మంది గజ ఈతగాళ్లు, సింగరేణి రెస్క్యూ టీం, ఫైర్ సిబ్బంది, గోదావరి తీరంలో ప్రత్యేక జేసీబీ క్రేన్, హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం అధికారులు వంతెన వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ప్రహ్లాద్, సీఐ రాంచందర్‌రావు, ఎస్సై చక్రపాణి, ఈవో మారుతి పాల్గొన్నారు.